చేతిలో యాప్.. కష్టాలకు ఫుల్‌స్టాప్!

- ప్రయాణికుల సేవలో 'రైల్ మదద్'
- 35 రకాల ఫిర్యాదులకు అవకాశం
- సిబ్బంది తక్షణ స్పందనకు చర్యలు
- జవాబుదారీతనం పెంచేలా ఏర్పాట్లు



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ(ఫైల్)

లక్ష్మీపురం: రైలు ప్రయాణమంటేనే ఎక్కువ సార్లు నరకయాతన అన్నట్లు ఉంటుంది. సమస్యలు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియదు. అందుబాటులో ఉన్న కిందిస్థాయి సిబ్బందికి చెప్పినా స్పందన అంతంత మాత్రంగానే ఉంటుందనే ఆరోపణలు సరేసరి. ఈ నేపథ్యంలోనే సౌత్ సెంట్రల్ రైల్వే ప్రత్యేకంగా ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిలో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండటంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంది. ప్రయాణికులకు అధికారులు, సిబ్బంది మరింత జవాబుదారీగా వ్యవహరించేందుకు రైల్వే శాఖ ఇప్పటికే ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ప్రయాణికుల భద్రత, వివిధ రకాల సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నంబర్లను ప్రకటించింది. తర్వాత నేరుగా ఫిర్యాదు చేసేందుకు రైల్ మదద్ పోర్టల్, యాప్‌లను తీసుకొచ్చింది. యాప్ ద్వారా ప్రయాణికులు 35 రకాల ఫిర్యాదులు చేసేందుకు అవకాశం కల్పించింది. సమస్యకు సంబంధించిన ఫొటోలను కూడా నేరుగా అప్‌లోడ్ చేయొచ్చు. తద్వారా ప్రయాణికులకు సౌకర్యం, భద్రతతో పాటు సిబ్బంది కూడా విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించే పరిస్థితి ఉంటోంది. ఫిర్యాదు చేయాలంటే విధిగా టికెట్ తీసుకుని ఉండాలి. రైలు బయట ఉంటే ఉంటే ప్లాట్ ఫాం టికెట్ ఉన్నప్పుడే యాప్ ద్వారా ఫిర్యాదుకు అవకాశం ఉంది. యాప్‌లో టికెట్ వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఈ ఫిర్యాదులపై రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం), డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) పర్యవేక్షణ ఉంటుంది. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారికి సమాచారం పంపుతారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా వారిని ఆదేశిస్తారు. తీసుకున్న చర్యలు, స్పందనను ఫిర్యాదుదారుడికి మెసేజ్ రూపంలో పంపించాల్సి ఉంటుంది. యాప్ ద్వారా అందిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కరించారో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో వీరు సమర్పించాలి.



గుంటూరు రైల్వే స్టేషన్

ఎలాంటి ఫిర్యాదులు చేయొచ్చంటే..

వైద్యసహాయం, భద్రతాలోపం, వేధింపులు, చోరీలు, దివ్యాంగులకు వసతుల లేమి, ప్రత్యేక అవసరాలు కలిగిన మహిళలకు సౌకర్యాల కొరత, రిజర్వ్ చేయని టిక్కెట్లు, రిజర్వేషన్ వివరాలు, సామగ్రి మరిచిపోవడం, చోరీకి గురవడం, టిక్కెట్ల డబ్బు వాపసు, సిబ్బంది ప్రవర్తనా లోపం, రైలులో పరిశుభ్రత లోపించడం, క్యాటరింగ్ సమస్యలు, ఆహార సరఫరాలో ఇబ్బందులు, నీటి వసతి లేకపోవడం, సిబ్బంది అవినీతికి పాల్పడటం, లంచం తీసుకోవడం, అధిక ధరల వసూలు వంటి అంశాలపై ఫిర్యాదుకు అవకాశం కల్పించారు. ప్రయాణ సమయంలో తక్షణ సహాయం అందుకోవచ్చు. ట్రైన్ ఆలస్యం, రద్దు గురించి సమాచారం పొందొచ్చు. యాప్ ద్వారా టికెట్ కూడా రద్దు చేయవచ్చు. భోజన సేవల వివరాలు, వాటి ధరలు పరిశీలించవచ్చు. రైల్వే స్టేషన్ల గురించి సమాచారం పొందొచ్చు. ప్లాట్‌ఫాం మార్పులు, కస్టమర్ సర్వీసు వివరాలు తెలుసుకోవచ్చు. సాంకేతిక సమస్యల నివారణ కోసం సహాయం తీసుకోవచ్చు. సహాయ కేంద్రాలకు సులభంగా చేరుకునే మార్గాలు పొందొచ్చు. లైవ్ చాట్ ద్వారా సాయం కోరవచ్చు. ట్రైన్ రూట్, రాకపోకల సమయం తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల పరిష్కారానికి వివరాలు ట్రాక్ చేయవచ్చు.

ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలంటే..

ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడ్ చేయాలి. అందులో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి నిబంధనలు అంగీకరించిన తర్వాత ఉపయోగించుకోవచ్చు. యాప్ తెరవగానే పేరు నమోదు చేసి, తర్వాత ఫోన్ నంబర్ ఇవ్వాలి. ఫోనుకు ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్) వస్తుంది. దాని ఆధారంగా యాప్‌లో ప్రయాణించే రైలు, ఫిర్యాదు వివరాలు, ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.



రైల్ మదద్ యాప్

ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం



రైల్ మదద్ యాప్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టింది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వారికి మరింత సౌకర్యవంతంగా ఉండేలా దీన్ని రూపొందించారు. యాప్ ద్వారా ప్రతి నెల డివిజన్ పరిధిలో సుమారు 150–250 వరకు ఫిర్యాదులు వస్తుంటాయి. టికెట్ రిజర్వేషన్ సమస్య, పారిశుద్ధ్యలోపం వంటి వాటిపై ఎక్కువగా ఫిర్యాదులు చేస్తుంటారు. వెంటనే పరిశీలించి సంబంధిత అధికారులకు, సిబ్బందికి నోటీసుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తుంటాం. ప్రయాణ సమయంలో ఇబ్బందులను నేరుగా ఉన్నతాధికారులకు తెలిపే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

– ఎం.రామకృష్ణ, డీఆర్ఎం, గుంటూరు రైల్వే డివిజన్

క్లుప్తంగా

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ(ఎఫ్ఏసీ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చెరిపితే చెరిగే చరిత్ర కాదు..



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): చెరిపితే చెరిగే చరిత్ర కాదు.. అంటూ పెదగొట్టిపాడు దళితులు భగ్గుమన్నారు. విజయవాడ నగరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పానికి జరిగిన అవమానాన్ని ఖండిస్తూ, నిరసనగా ఆదివారం రాత్రి మండల పరిధిలోని పెదగొట్టిపాడు దళితవాడలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో దళిత మహిళలు, యువకులు, పెద్దలు స్వచ్ఛందంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జోహార్ అంబేడ్కర్ అంటూ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫొటోలు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆగంతకులు రాజ్యాంగ ప్రధాత అంబేడ్కర్ విగ్రహం వద్ద విధ్వంసానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి దుశ్చర్యను మూకుమ్మడిగా ఖండిస్తున్నామని చెప్పారు. దాడి వెనుక కచ్చితంగా రాజకీయ కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దాడి ప్రజాస్వామ్యంపైనా, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు, దళితులపై జరిగిన దాడిగానే యావత్ దళితులు భావించాల్సిన అవసరం ఉందని ముక్తకంఠంతో నినదించారు. నగరం నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ లేకపోతే దళితజాతికి ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో దళిత పెద్దలు పిల్లి ఆనంద్ బాబు, బూసి సుబ్బారావు, జొన్నలగడ్డ దయానందం, మన్నవ మహేంద్ర, జొన్నలగడ్డ ప్రభాకర్, జొన్నలగడ్డ రత్నబాబు, దళిత యువత, మహిళలు, పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



మంగళగిరి: పట్టణంలో తోపుడు బండ్లు, కూరగాయల బండ్లు ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వినోద్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని మెయిన్ బజార్, గౌతమబుద్ధా రోడ్డులో పర్యటించి తోపుడు బండ్ల, కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారులు తమ వ్యాపారానికి వాడే బండ్లు వగైరాలను రోడ్లపై ఉంచి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుంచకుండా చూడాలన్నారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు అధికారులు కేటాయించిన స్థలాల్లో వ్యాపారం చేసుకుని, అధికారులకు సహకరించాలని కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ, జనసేన వ్యతిరేకించాలి

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే వక్ఫ్ సవరణ బిల్లును తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. ఆదివారం దుగ్గిరాలలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుల స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవాలని కుట్రపూరితమైన ధోరణితో ముందుకు వెళ్తోందని అన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జానీ సైదా పాల్గొన్నారు.

నేడు నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ప్రచారంలో భాగంగా 'వికసిత భారత్ కా మంత్ర, భారత్ హో నషా సే స్వతంత్ర'పై సోమవారం ఉదయం 8.00 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించనున్నట్లు గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో పాల్గొనేందుకు గుంటూరు నగర పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులను యూనిఫాంలో ఉదయం 7.00 గంటలకు కలెక్టరేట్ వద్ద హాజరు కావాల్సిందిగా చూడాలని సూచించారు. అదే విధంగా సోమవారం ఉదయం 9.00 గంటలకు డివిజన్‌లోని అన్ని పాఠశాలల్లో నషా ముక్త్ భారత్ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో ర్యాలీని నిర్వహించి, ఆయా కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

కళాశాల విద్యార్థినికి ఆర్థిక సాయం



ఫిరంగిపురం: కుమ్మర శాలివాహన జిల్లా సంఘం ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని అల్లంవారిపాలెం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. సంఘ సభ్యుడు కె.రాములు మాట్లాడుతూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకయ్య పిలుపు మేరకు తమ సంఘంలో ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లల చదువుల నిమిత్తం సహాయం చేస్తున్నామన్నారు. మార్కాపురానికి చెందిన సీహెచ్ నీలావతి గుంటూరు రూరల్‌లోని ఆర్‌వీఆర్ కళాశాలలో బీటెక్ చదువుతుండటంతో విద్యార్థికి రూ.15 వేలు సాయం అందించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించాలి



విద్యార్థులతో రాజేంద్రప్రసాద్, వాసుదేవరావు, యోగి మహేశ్వరానంద స్వామీజీ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే దేశభక్తి భావాలను పెంపొందించాలని ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గన్నే వాసు ఆర్ట్స్, శ్రీ విశ్వకర్మ పీఠం, శంబయాచార్య లలిత కళా పురస్కారాల సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అరండల్‌పేటలోని శ్రీ దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, ఏకపాత్రాభినయాల పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. గన్నే వాసు ఆర్ట్స్ వ్యవస్థాపకుడు వాసుదేవరావు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, నటన, సాంస్కృతిక అంశాలతో పాటు దేశభక్తి ప్రేరేపిత లఘు చిత్రాలు నిర్మిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యోగి మహేశ్వరానంద స్వామీజీ, వి.హనుమంతరావు, కేవీ మల్లికార్జున ఆచారి, మమత, సుకన్య, హరినాథ్ బాబు, సాంబయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి గీతాలలో కె.కమల్య(కాటూరి పబ్లిక్ స్కూల్), ఎ.నవనీత (లోటస్ ఆద్య పాఠశాల), బీవీ చరితసాయి(కన్నా పాఠశాల), అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయంలో ఎస్.నీరజ్ (శ్రీవేంకటేశ్వర బాలకుటీర్), ఎస్.సాయికృష్ణ(విజ్‌డమ్ స్కూల్), ప్రణీత్(శిశు విద్యా మందిర్), ఝాన్సీలక్ష్మీబాయి ఏక పాత్రాభినయంలో ధృతి(కన్న స్కూల్), హరిణి(శిశువిద్య మందిర్), మోక్ష శ్రీ(లోటస్ ఆద్య స్కూల్), వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

రామచంద్రరావు మృతి సీపీఐకి తీరని లోటు



రామచంద్రరావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: సీపీఐకి రామచంద్రరావు ఒక ట్రైనింగ్ స్కూల్ లాంటివారు అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో డి.ఎస్.రామచంద్రరావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి వి.రమణ అధ్యక్షత వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీపీఐ కార్యాలయ కార్యదర్శిగా, కోశాధికారిగా సుదీర్ఘ కాలం రామచంద్రరావు సేవలందించారని కొనియాడారు. జంగాల అజయ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇట్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంత రావు, నాయకులు బందెల నాసర్ జీ, జంగాల చైతన్య, జి.సురేష్ బాబు, బండారపు యస్వంత్, మున్నా, చల్లా మరియ దాస్, చెవుల పున్నయ్య, నూతలపాటి చిన్న పాల్గొన్నారు.

మిర్చి ఘాటు.. ప్రజారోగ్యానికి చేటు





ప్రధాన రహదారి వెంట పడేసిన మిర్చి వ్యర్థాలు

గుంటూరు రూరల్: స్థానిక మిర్చి యార్డులో ఎక్స్‌పోర్ట్ చేసే సంస్థలు కొన్ని.. నగర శివారులోని నల్లపాడు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, తురకపాలెం, ఓబులు నాయుడుపాలెం, నాయుడుపేట, పొత్తూరు, లింగాయపాలెం ఖాళీ స్థలాలు, లాలుపురం పరిసరాల్లో షెడ్‌లు ఏర్పాటు చేసుకుని మిర్చి తొడేలను తీస్తుంటాయి. అనంతరం వ్యర్థాలను బస్తాల్లో తీసుకెళ్లి ఆయా గ్రామాల ప్రధాన వీధుల వెంట పడేస్తున్నారు. రాత్రిళ్లు వాటిని దహనం చేస్తుంటారు. ఈ క్రమంలో వాటి నుంచి వచ్చే కోరును ప్రయాణికులతో పాటు, సమీప గ్రామాల ప్రజలు పీల్చలేక దగ్గు బారిన పడుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇలాగే.. కొనసాగితే శ్వాసకోశ వ్యాధులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఊపిరి తిత్తులు దెబ్బతినే అవకాశాలు లేకపోలేదని స్థానిక వైద్యులు కూడా హెచ్చరిస్తున్నారు. మిర్చి యార్డులో మిరప కాయలు విక్రయాల అనంతరం నేలపై మిగిలిపోయి, రాలిపోయిన మిర్చి విత్తనాలు ఊడుపు పేరుతో కొందరు కొనుగోలు చేస్తారు. వాటిని నాయుడుపేట, ఓబులునాయుడుపాలెం, వెంగళాయపాలెం, పొత్తూరు, చౌడవరం గ్రామాల శివారుల్లో పెద్దపెద్ద మిషన్‌లు ఏర్పాటు చేసి తూర్పారబట్టి విత్తనాలు తయారు చేస్తుంటారు. ఈ క్రమంలో గాలికి మిర్చి ఘాటుతో కూడిన దుమ్ము తెరలు తెరలుగా రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అసలు మిర్చి విత్తనాలు తయారీ చేసి వాటిని నేరుగా రైతులకు విక్రయిస్తారా..? లేక ఇంకా ఏమైనా చేస్తారా..? అనే విషయాలు కనీసం వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులకు తెలియదంటే అతిశయోక్తికాదు. కనీసం వారిపై నిఘా ఉంచి, ఆ విత్తనాలు ఏంచేస్తారని అధికారులు కూడా పట్టించుకోక పోవటంతో వాటిని కొందరు నూనె తీసేందుకు వాడతారని, కొందరు నకిలీ మిర్చి విత్తనాల్లో కలుపుతారని అంటున్నారు. ఒక పక్క నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయి ప్రాణాలు సైతం కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్రలేఖనం పోటీల్లో చిన్నారుల ప్రతిభ



తాడేపల్లిరూరల్: చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు ప్రతిభకనబరిచారు. మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. సెల్‌ఫోన్‌లు వచ్చి బాలబాలికలను ఆటలకు దూరం చేస్తున్నాయని హెచ్చరించారు. చందమామ, బాలమిత్ర, పంచతంత్ర కథలు లాంటి పుస్తకాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ చిన్నారులు ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పోటీతత్వం పెరగడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. బాలోత్సవం రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లడుతూ బాలబాలికలు చదువుతో పాటు చుట్టుపక్కల జరుగుతున్న అనేక సమాజ పరిణామాలను కూడా గమనించాలని అన్నారు. అనంతరం డాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికలు వివిధ రకాల డ్యాన్సులు, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు, కోలాటం ప్రదర్శించారు. కాజ నుంచి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఎక్కడ వచ్చిందమ్మ స్త్రీ జాతికి స్వాతంత్ర్యం నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎం.సంధ్యారాణి, ఇ.రాజశేఖర్, విక్రమ్, జి.రమ్య, వై.అచ్యుతరావు, పి.విజయ, నాగరాజు, వెంకటరావు, జి.సుమ, వై.సౌజన్య, ప్రకాష్ పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి నివాళి

తాడేపల్లిరూరల్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి ఆదివారం పలువురు నివాళులర్పించారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సీపీఎం నాయకులు భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ 11 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ప్రజలకు సుపరిపాలన అందించడమే కాక, పేద, బడుగు బలహీన వర్గాల పోరాటాలకు సారథ్యం వహించారని, ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం చేసేందుకు పారిశ్రామిక రంగాన్ని ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. కార్యక్రమంలో కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, నాయకులు సింగంశెట్టి రవికిషోర్, సాంబిరెడ్డి, బాకీ శ్రీనివాసరావు, ఎ.అర్జున్‌రావు, ఎ.శివ పాల్గొన్నారు.

ప్రొస్టేట్ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మొహ్సిన్ ఖాద్రి

గుంటూరు మెడికల్: ప్రొస్టేట్ సమస్యపై అప్రమత్తంగా ఉండాలని యురాలజిస్ట్ మొహ్సిన్ ఖాద్రి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ భవనంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'ప్రొస్టేట్ గ్రంథి వ్యాధులు– లక్షణాలు– నివారణ చర్యలు 'అనే అంశంపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఖాద్రి పాల్గొని ప్రసంగించారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవ కుమార్ అధ్యక్షత వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె.సతీష్ బాబు మాట్లాడుతూ ప్రొస్టేట్ గ్రంథి సమస్యలు ఎక్కువ మందిని బాధిస్తున్నాయని దీనికి ఇప్పుడు పూర్తి చికిత్స ఉందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సిహెచ్.శివాజీ, ఎస్.సాంబశివరావు, పి.సుధాకర్‌రావు, టి.వి. సాయిరాం, ఎ.అనంత రామయ్య పాల్గొన్నారు. సభానంతరం డాక్టర్ ఖాద్రి ప్రొస్టేట్ గ్రంథి సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి, వైద్య సలహాలు అందజేశారు.

అవగాహన ఆధ్వర్యంలో..



మాట్లాడుతున్న సత్యనారాయణ గుప్తా

లక్ష్మీపురం: మూత్ర సంబంధిత వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సీనియర్ యురాలజిస్ట్ సత్యనారాయణ గుప్తా అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ప్రొస్టేట్ గ్రంథి, మూత్ర సంబంధిత వ్యాధులు, చికిత్స విధానాలపై ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూత్రపిండాల్లో రాళ్ల సమస్య కేసులు అధికమైనట్లు చెప్పారు. ప్రొస్టేట్ గ్రంథి సమస్యపై దృష్టి పెట్టాలని వివరించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఎం.వి.సత్యనారాయణ గుప్తా ఘనంగా సత్కరించారు. సమావేశంలో టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆరోగ్య ప్రచారకులు వీవీ రావు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణయ్య, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కే చంద్రశేఖరరావు ప్రసంగించారు.

జీజీహెచ్ క్యాజువాల్టీలో తనిఖీలు



రోగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అత్యవసర వైద్య సేవల విభాగాన్ని(క్యాజువాలిటీ) ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు గంటల నుంచి స్ట్రెచర్‌పై బాధ పడుతున్న రోగికి అందుబాటులో ఉన్న పడక పైకి చేర్చారు. స్ట్రెచర్‌పై ఎక్కువ సేపు ఉండకుండా వెంటనే పడకను అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఇన్‌పేషెంట్ విభాగంలో ఆర్థోపెడిక్ వైద్య విభాగం నుంచి జనన మరణ ధ్రువీకరణ కేంద్రం వరకు కొన్నేళ్లుగా అధ్వాన రహదారితో ఇబ్బందులు పడుతున్న రోగులు వారి సహాయకుల కష్టాలు తొలగిపోనున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆర్థోపెడిక్ వార్డు నుంచి ఎం ఆర్‌డీ కేంద్రం వరకు పూర్తిగా గుంతలు పడి రోగులు, వారి సహాయకులు నడిచేందుకు రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఏపీ ఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో రోడ్డు నిర్మాణంపై చర్చించి ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులను కోరినట్లు చెప్పారు. అధికారులు దాదాపు రూ.12 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ కిరణ్ కుమార్ రోడ్డును పరిశీలించారు.